RNI : APTEL / 2003 / 89152

ONE click
ePaper
www.shanmukhavelugu.com

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 177
శనివారం 04 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

# రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధికి నాంది




**జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం**

**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం**

**రూ.16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో**

**20 లక్షల టన్నుల సామర్థ్యంతో నిర్మాణం కానున్న ఉక్కు కర్మాగారం**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 3)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థ వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లె వద్ద రాయలసీమ సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మాణ పనులను నాంది పలికింది. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జమ్మలమడుగు మండలం సున్నపు రాళ్ళ పల్లె వద్ద ఈ బృహత్తరమైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ జయంత్ ఆచార్య, జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్ సవిత, రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్, రాష్ట్ర పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ యువరాజ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.




**రెండు దశల్లో రూ.16,350 కోట్ల పెట్టుబడి**

జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పూర్తిగా అనుబంధ సంస్థగా ఈ ప్రాజెక్టు అమలవుతోంది. మొత్తం 20 లక్షల టన్నుల (2 ఎంటిపిఏ) వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని రెండు దశల్లో నిర్మించనున్నారు. మొదటి దశలో రూ.4,500 కోట్ల పెట్టుబడితో సంవత్సరానికి 10 లక్షల టన్నుల సామర్థ్యమున్న సమీకృత ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తారు. రెండో దశలో మరో రూ.11,850 కోట్ల పెట్టుబడితో సామర్థ్యాన్ని 20 లక్షల టన్నులకు పెంచనున్నారు. దీంతో మొత్తం పెట్టుబడి వ్యయం రూ.16,350 కోట్లకు చేరనుంది.

**అత్యాధునిక సాంకేతికతతో పర్యావరణహిత ఉత్పత్తి..**

ఈ ప్రాజెక్టులో అత్యాధునిక ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ సాంకేతికతను వినియోగించనున్నారు. పునర్వినియోగ ఉక్కు స్క్రాప్, డైరెక్ట్ రిడ్యూస్డ్ ఐరన్ (డిఆర్ఐ)ను ముడి పదార్థాలుగా ఉపయోగించి తక్కువ కార్బన్ ఉద్గారాలతో అత్యుత్తమ నిర్మాణ ఉక్కును తయారు చేయనున్నారు. పునరుత్పాదక విద్యుత్ వినియోగం, ఇంధన పొదుపు సాంకేతికతలు, వనరుల సమర్థ వినియోగం ద్వారా దేశంలోనే అత్యంత సుస్థిర ఉక్కు తయారీ కేంద్రాల్లో ఒకటిగా ఈ కర్మాగారాన్ని తీర్చిదిద్దనున్నారు.

**రాయలసీమకు పారిశ్రామికంగా భారీ ఊతం...**

ఈ ప్రాజెక్టు ద్వారా రహదారి, రైల్వే, విద్యుత్, నీటి వసతులు మరింత అభివృద్ధి చెందనున్నాయి. అనుబంధ పరిశ్రమలు, లాజిస్టిక్స్ రంగం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. రాయలసీమను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇది బలమైన పునాదిగా మారనుంది.

**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం పై జేఎస్‌డబ్ల్యూ ప్రశంసలు**

రాయలసీమ స్టీల్ ప్రాజెక్టు ప్రారంభం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక భవిష్యత్తుపై జేఎస్‌డబ్ల్యూ నమ్మకానికి నిదర్శనమని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్ ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో తయారీ రంగం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని కొనియాడారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక సామర్థ్యాల నిర్మాణంలో భాగస్వాములు కావడం తమకు గర్వకారణమని తెలిపారు.

**దేశ ఉక్కు రంగానికి కొత్త బలం...**

తయారీ, మౌలిక సదుపాయాల విస్తరణలో భారతదేశం కీలక దశలో ఉందని, ఆంధ్రప్రదేశ్ ఈ అభివృద్ధికి కేంద్రబిందువుగా మారుతోందని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ జయంత్ ఆచార్య పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు దేశీయ ఉక్కు తయారీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రాయలసీమ ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ▶ 2లో

## అమరావతి పేరుతో చేస్తున్న అప్పుల భారం చివరకు ప్రజలపైనే పడుతుంది: సజ్జల

ఏపీ ఇప్పటికే లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయిందన్న సజ్జల



అమరావతి కోసం మరో రూ. 2 లక్షల కోట్ల భారం మోపితే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్న

ప్రభుత్వాన్ని వైసీపీ ప్రశ్నిస్తూనే ఉంటుందన్న సజ్జల

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 03)**

రాజధాని అమరావతి అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం భారీ అప్పులు చేస్తోందని... ఈ భారం చివరికి రాష్ట్ర ప్రజల నెత్తినే పడబోతోందని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ధనంతో చేపట్టే ప్రతి ప్రాజెక్టుపై పారదర్శకత ఉండాలని అన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ప్రధాన ప్రతిపక్షంగా తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు.రాజధాని కోసం భూములిచ్చిన ▶ 2లో

## భారత్ రక్షణ మరింత పటిష్ఠం.. రూ.52 వేల కోట్లతో ఆయుధాల కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్



2

## మోదీకి చంద్రబాబు వంటి నేతలు తోడైతే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది: సజ్జన్ జిందాల్

**చంద్రబాబు విజన్‌పై సజ్జన్ జిందాల్ ప్రశంసలు**

**కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం**



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 03)**

ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి దార్శనికత ఉన్న నాయకులు దేశంలో చాలా అరుదుగా ఉంటారని, ఆయన వచ్చే 25 ఏళ్ల అభివృద్ధిని ముందుగానే ఆలోచించి అమలు చేస్తారని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అధినేత సజ్జన్ జిందాల్ ప్రశంసించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు విజన్ వల్లే సైబరాబాద్ నగరం ప్రపంచ స్థాయి ఐటీ హబ్‌గా ఎదిగిందని ఆయన గుర్తుచేశారు. దేశాభివృద్ధి గురించి నిత్యం తపించే ప్రధాని నరేంద్ర మోదీకి చంద్రబాబు లాంటి ముఖ్యమంత్రులు తోడైతే, దేశం మరింత వేగంగా లక్ష్యాలను అందుకుంటుందని జిందాల్ అభిప్రాయపడ్డారు. ▶ మిగతా 2లో

## మంగళగిరి క్షేత్రానికి కొత్త శోభ..

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి మంత్రి శంకుస్థాపన

రూ.6.3 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో జీర్ణోద్ధరణ పనులు

నూతన యాగశాల, శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణకు శ్రీకారం

భక్తుల సౌకర్యార్థం మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు లోకేశ్ ఆదేశం

ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని మంత్రి సూచన

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 03)**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి, జీర్ణోద్ధరణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. దిగువ సన్నిధిలో రూ.6.3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు కీలక పనులకు ఆయన ఇవాళ భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా చారిత్రక కట్టడాల పునరుద్ధరణతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు.అంతకుముందు ఆలయానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు, అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నూతన యాగశాల నిర్మాణం, వాహనశాల, గంటా మండపం పునర్నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. చారిత్రక ప్రాధాన్యమున్న శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ పనులను కూడా ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పనులకు సంబంధించిన నమూనా చిత్రాలను పరిశీలించారు. ▶ మిగతా 2లో

## అయోధ్య విరాళాల చోరీ కేసు.. తొలిసారి స్పందించిన ఆరెస్సెస్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 03)**

అయోధ్య రామ మందిర విరాళాల చోరీ ఘటనపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆందోళన వ్యక్తం చేసింది. రాముడి విరాళాలను దొంగిలించడం తమను తీవ్రంగా బాధిస్తోందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే విచారం వ్యక్తం చేశారు. తరతరాలుగా భక్తుల త్యాగాలు, అంకితభావం కారణంగా శ్రీరామ జన్మభూమిలోని ఈ భారీ ఆలయం రూపుదిద్దుకుందన్నారు. ఆలయ నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఒక ప్రత్యేకమైన అంశంగా పరిగణించి, ఆలయ నిర్వహణలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాలని హోసబలే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను కోరారు. ఈ కేసులో దర్యాప్తు జరుగుతున్నందున నిందితులకు శిక్ష పడే వరకు సంయమనం పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను అవకాశంగా తీసుకొని కొందరు వ్యక్తులు హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

**చంపత్ రాయ్‌కు నోటీసులు..?**

రామ మందిర విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో రాజీనామా చేసిన అయోధ్య ఆలయ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాలకు ▶ మిగతా 2లో

## మేము సంపాదిస్తే తప్పేంటి?.. క్రిప్టో వివాదంపై నోరు విప్పిన ట్రంప్



క్రిప్టో వ్యాపారాల ద్వారా ట్రంప్ కుటుంబానికి రూ. 11,600 కోట్లకు పైగా ఆదాయం

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 03)**

క్రిప్టోకరెన్సీ వ్యాపారాల ద్వారా సంపాదించిన భారీ లాభాలపై వస్తున్న విమర్శలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. తమ వ్యాపార సామ్రాజ్యం సంపాదించిన నిధులలో ఎలాంటి 'చట్టవిరుద్ధమైన' లేదా తప్పుడు విధానాలు లేవని సమర్థించుకున్నారు. ▶ మిగతా 2లో

## రూ.450 కోట్ల రుషికొండ భవనాల వినియోగంపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం



**వైసీపీ ప్రభుత్వ హయాంలో రుషికొండపై భారీ భవనాల నిర్మాణం**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 03)**

విశాఖపట్నంలో నిర్మించిన వివాదాస్పద రుషికొండ పర్యాటక భవనాల వినియోగంపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.450 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన ఈ ప్యాలెస్ లాంటి భవనాలను 'ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్' ▶ మిగతా 2లో

# భారత్ రక్షణ మరింత పటిష్ఠం.. రూ.52 వేల కోట్లతో ఆయుధాల కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 03)

భారత సాయుధ దళాల సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) సమావేశంలో సుమారు రూ.52 వేల కోట్ల విలువైన రక్షణ కొనుగోళ్లకు ఆమోదం లభించింది.భారత సైన్యం కోసం యాంటీ డ్రోన్ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థ 'ఆకాశ్ తరంగ్', మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైళ్లు, మీడియం రేంజ్ 'సర్ఫేస్ టు ఎయిర్' మిసైల్ వ్యవస్థ, వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, ట్యాంకులకు యాక్టివ్ ప్రొటెక్షన్ సిస్టమ్, జెట్ ఆధారిత కమికాజే డ్రోన్ వ్యవస్థ కొనుగోళ్లకు ఆమోదం లభించింది.నౌకాదళం కోసం మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్స్, నౌకల నుంచి ప్రయోగించే మానవరహిత వైమానిక వ్యవస్థలకు, ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థల పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. దీంతో సముద్ర నిఘా, శత్రు కదలికల పర్యవేక్షణ సామర్థ్యం పెరుగుతుందని ప్రభుత్వం తెలిపింది.వాయుసేన కోసం 'ఫిక్స్‌డ్ వింగ్ హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్' కొనుగోలుకు కూడా డీఏసీ ఆమోదం తెలిపింది. దీని ద్వారా దీర్ఘకాలిక నిఘా, ఇంటెలిజెన్స్, టెలికమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్ సామర్థ్యాలు మరింత బలోపేతం కానున్నాయి. ఈ కొనుగోళ్లతో మూడు దళాల యుద్ధ సన్నద్ధత, సరిహద్దుల భద్రత, ఆధునిక సాంకేతిక సామర్థ్యాలు మరింత పెరుగుతాయని రక్షణ శాఖ వెల్లడించింది.

## అమరావతి పేరుతో చేస్తున్న అప్పుల భారం చివరకు ప్రజలపైనే పడుతుంది: సజ్జల

రైతులకు తిరిగి ఇవ్వాల్సిన ప్లాట్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా... ప్రభుత్వం మాత్రం రైతులను చివరి ప్రాధాన్యతగా చూస్తోందని ఆరోపించారు. అమరావతిలో ఒక్క చదరపు అడుగు నిర్మాణానికి ఏకంగా రూ.20 వేల వరకు ఖర్చు చేస్తున్నారని... దీనిపై తాము సందేహాలు వ్యక్తం చేస్తే అధికార పక్షం సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని మండిపడ్డారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.47 వేల కోట్ల వరకు అప్పులు తీసుకువచ్చిందని సజ్జల వెల్లడించారు. అంత భారీ నిధులను రాజధాని హంగులకే తగలేయకుండా... మచిలీపట్నం పోర్టు, కొత్త మెడికల్ కళాశాలలు, హంద్రీ-నీవా సుజల స్రవంతి, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి కీలక పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం చేకూరేదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లక్షల కోట్ల అప్పుల్లో మునిగిపోయిందని... ఇలాంటి తరుణంలో రాజధాని కోసం మరో రూ.2 లక్షల కోట్ల అదనపు భారం మోపితే సామాన్యుడి పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో 40 శాతం మంది ప్రజలు ఓటు వేసిన బలమైన పార్టీగా వైసీపీ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తూనే ఉంటుందని చెప్పారు.

## మోదీకి చంద్రబాబు వంటి నేతలు తోడైతే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది: సజ్జన్ జిందాల్

చంద్రబాబు వంటి నేతలతో కలిసి పనిచేయడం పారిశ్రామికవేత్తగా తనకు గౌరవమని ఆయన పేర్కొన్నారు.కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ లిమిటెడ్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, సజ్జన్ జిందాల్‌తో కలిసి ఆయన కాంక్రీట్ వేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ.. తమ గ్రూప్ తరపున ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు

## మొదటిపేజీ తరువాయి

రూ.50 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్టు సంచలన ప్రకటన చేశారు. ఈ పెట్టుబడులతో సుమారు 50 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని హామీ ఇచ్చారు.రాయలసీమ స్టీల్ ప్లాంట్‌తో పాటు విజయనగరం జిల్లాలో ఒక ఇండస్ట్రియల్ పార్కును కూడా ఏర్పాటు చేస్తున్నామని జిందాల్ వెల్లడించారు. ప్రస్తుతం ఏడాదికి 1 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ప్రారంభమవుతున్న ఈ స్టీల్ ప్లాంట్‌ను భవిష్యత్తులో మరింతగా విస్తరిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

ఈ స్టీల్ ప్లాంట్‌ను మొత్తం రూ.16,350 కోట్ల భారీ పెట్టుబడితో రెండు దశల్లో నిర్మించనున్నారు. తొలిదశ పూర్తయితే ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. స్టీల్ ప్లాంట్‌తో పాటు, దీనికి అనుబంధంగా జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు.

## అయోధ్య విరాళాల చోరీ కేసు.. తొలిసారి స్పందించిన ఆరెస్సెస్

శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ షో-కాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయ అధికారుల మధ్య జులై 6న జరగనున్న కీలక సమావేశంలో ఈ చర్యలు తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విరాళాల అవకతవకలకు సంబంధించి లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని వారిని కోరనున్నట్లు తెలిపాయి. దర్యాప్తు అనంతరం వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

## మేము సంపాదిస్తే తప్పేంటి?.. క్రిప్టో వివాదంపై నోరు విప్పిన ట్రంప్

ఇటీవల విడుదలైన అధ్యక్షుడి అధికారిక ఆర్థిక సమాచార వెల్లడి పత్రాల ప్రకారం.. 2025 ఒక్క సంవత్సరంలోనే ట్రంప్ కుటుంబానికి చెందిన క్రిప్టో సంస్థలు ఏకంగా 1.4 బిలియన్ డాలర్లకు పైగా (సుమారు రూ. 11,600 కోట్లు) ఆదాయాన్ని ఆర్జించాయి. ట్రంప్ తన మొత్తం వార్షిక ఆదాయం 2.2 బిలియన్ డాలర్లుగా చూపించగా.. అందులో సగానికి పైగా క్రిప్టో ద్వారానే రావడం గమనార్హం.

**ఆదాయం ఎక్కడి నుంచి వచ్చింది?:** వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్: ట్రంప్ కుమారులు ఎరిక్, డొనాల్డ్ ట్రంప్ జూనియర్లతో కలిసి ప్రారంభించిన ఈ క్రిప్టో ప్లాట్‌ఫాం గవర్నెన్స్ టోకెన్ల విక్రయం ద్వారా 500 మిలియన్ డాలర్లకు పైగా లాభాలు వచ్చాయి.సీఐసీ డిజిటల్ ఎల్ఎల్‌సీ: ట్రంప్ పేరుతో నడిచే 'మి=ఖవ్రీ' మీమ్‌కాయిన్ లైసెన్సింగ్, ఫీజుల ద్వారా ఈ సంస్థ ఏకంగా 600 మిలియన్ డాలర్ల పైగా ఆర్జించింది.

**ట్రంప్ ఏమన్నారంటే? :** ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ 'సీఎన్‌బీసీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యవహారంపై స్పందించారు. తనకు ఈ వ్యాపారాల కచ్చితమైన లాభాల గణాంకాలు తెలియకపోయినప్పటికీ.. ఇవన్నీ చట్టబద్ధమైన వ్యాపారాలేనని ఆయన తేల్చి చెప్పారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో చైనాతో పోటీ పడుతున్నట్లే.. క్రిప్టో రంగంలోనూ అమెరికా అగ్రస్థానంలో నిలవాలనేది నా వ్యూహం. ఇందులో ఎలాంటి ప్రయోజనాల ఘర్షణ లేదు" అని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ వ్యాపారాలను తన కుమారులు స్వతంత్రంగా చూసుకుంటున్నారని వైట్ హౌస్ సైతం సమర్థించుకుంది.

**మద్దతుదారుల మునక.. నిపుణుల ఆందోళన**

ఈ వ్యవహారంపై అమెరికాలో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్‌ను నమ్మి ఆయన బ్రాండ్ ఉన్న క్రిప్టో కాయిన్స్ కొనుగోలు చేసిన వేలాది మంది రిటైల్ ఇన్వెస్టర్లు (ముఖ్యంగా ట్రంప్ రాజకీయ మద్దతుదారులు) ఘోరంగా నష్టపోయారు. ప్రారంభంలో ఈ కాయిన్స్ అమ్మిన ట్రంప్ సంస్థలు లాభాలు గడించగా, ప్రస్తుతం మెజారిటీ ఇన్వెస్టర్ల క్రిప్టో వాలెట్లు భారీ నష్టాల్లో ఉన్నట్లు నివేదికలు చెప్తున్నాయి.మరోవైపు, క్రిప్టో రంగాన్ని ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే అధికారంలో ఉన్న దేశాధ్యక్షుడే.. స్వయంగా ఆయా కాయిన్స్ ద్వారా లాభాలు పొందడం నైతికంగా తప్పని నైతిక విశ్లేషకులు, డెమొక్రాట్ పార్టీ నేతలు మండిపడుతున్నారు.

## రూ.450 కోట్ల రుషికొండ భవనాల వినియోగంపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

ప్రాతిపదికన లీజుకు ఇవ్వాలని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్ణయించింది. ఇందులో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో వీటిని నిర్వహించేందుకు ఆసక్తి గల సంస్థల నుంచి 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' కోరుతూ అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది.రాజకీయ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా గత రెండేళ్లుగా ఈ భవనాలు ఎలాంటి వినియోగం లేకుండా ఖాళీగా పడి ఉన్నాయి. ఫలితంగా ఇవి క్రమంగా దెబ్బతింటున్నాయని, పైగా వీటి భద్రత, నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రతి నెల దాదాపు రూ.25 లక్షల ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేయాల్సి వస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రుషికొండ భవనాలపై అధ్యయనం చేసిన మంత్రివర్గ ఉపసంఘం... వీటిని ఒక లగ్జరీ రిసార్ట్‌గా మార్చితే పర్యాటక రంగానికి లాభసాటిగా ఉంటుందని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ నివేదిక ఆధారంగానే లీజు ప్రక్రియ మొదలైంది.

అయితే, ఈ లగ్జరీ రిసార్ట్ ప్రాజెక్టును దక్కించుకునేందుకు ఆసక్తి చూపుతున్న పలువురు బడా పెట్టుబడిదారులు... ప్రస్తుతం ఉన్న భవనాలకు అదనంగా మరికొన్ని కొత్త నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కానీ, రుషికొండపై జరిగిన నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే తీర ప్రాంత నియంత్రణ మండలి నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు ఉండటం, జాతీయ హరిత ట్రైబ్యునల్ తో పాటు కోర్టుల్లో కేసులు నడుస్తుండటంతో... అదనపు అనుమతుల అంశంపై ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది.

## మంగళగిరి క్షేత్రానికి కొత్త శోభ..

ఆ తర్వాత మంత్రి లోకేశ్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ఆలయ ప్రాంగణాన్ని పూర్తిగా కలియతిరిగి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు, ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం ఒక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. చేపట్టే పనులన్నీ ఆలయ సంప్రదాయాలకు, ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా చూడాలని, నిత్య ప్రసాద వితరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ పుష్కరిణిని కూడా పరిశీలించి, దాని అభివృద్ధికి అవసరమైన సలహాలు ఇచ్చారు.దేవాదాయ శాఖ సమకూర్చిన రూ.6.3 కోట్ల నిధులతో ఈ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా చారిత్రక శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ, నూతన యాగశాల, గంటా మండపం, వాహనశాల పునర్నిర్మాణం వంటి ముఖ్యమైన పనులు జరగనున్నాయి. మంగళగిరి క్షేత్ర పూర్వ వైభవాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమం అనంతరం మంత్రి లోకేశ్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్థానికులు, కార్యకర్తలతో కలిసి ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఆలయ ఈవో కోగంటి సునీల్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు పలువురు టీడీపీ ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.







## రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధికి నాంది

**జేఎస్‌డబ్ల్యూ లక్ష్యం-సుస్థిర అభివృద్ధి...**

2030 నాటికి ఉక్కు తయారీ కేంద్రాల్లో కార్బన్ ఉద్గారాలను 42 శాతం తగ్గించడం, 2050 నాటికి నికర కార్బన్ తటస్థత సాధించడం జేఎస్‌డబ్ల్యూ లక్ష్యంగా పెట్టుకుంది.జీవవైవిధ్య పరిరక్షణ, నీటి వినియోగ నియంత్రణ, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వంటి పర్యావరణ ప్రమాణాలను ఈ ప్రాజెక్టులో అమలు చేయనుంది.

**రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో మరో మైలురాయి..**

రాయలసీమ స్టీల్ ప్రాజెక్టు ప్రారంభం కేవలం ఒక కర్మాగార నిర్మాణానికి మాత్రమే కాకుండా, రాయలసీమను జాతీయ పారిశ్రామిక పటంలో మరింత బలంగా నిలబెట్టే కీలక అడుగుగా నిలవనుంది. భారీ పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, పర్యావరణహిత ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు, అనుబంధ పరిశ్రమల అభివృద్ధితో ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక పురోగతిలో ఒక మైలురాయిగా నిలుస్తుందనడంలో ఈ శంకుస్థాపన ఘట్టం ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డాక్టర్ నిధీమీనా, సబ్ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, కమలాపురం, మైదుకూరు ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, నాయకులు పివిఎన్ మాధవ్, భూపేష్ రెడ్డి, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







## రూ.2.34 కోట్లతో సిసి రోడ్లు, డ్రైన్స్‌కు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 3)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని పలు వార్డులలో సిసి రోడ్లు, డ్రైన్లను ప్రారంభించడంతో పాటు కొన్నిటికి శంకుస్థాపనలు చేశారు. పట్టణంలో 1వ వార్డ్‌లో రూ.8.40 లక్షలు, 10, 11 వార్డులలో రూ.14.20 లక్షలు, 12వ వార్డ్‌లో రూ.10.50 లక్షలు, 29వ వార్డ్‌లో రూ.10.50 లక్షలు, 31, 32 వార్డ్‌లలో రూ.35.17 లక్షలు, 33వ వార్డ్‌లో రూ.25 లక్షలు, 35 వ వార్డ్‌లో రూ.26.70 లక్షలు మొత్తంగా 1 కోటి 53 లక్షల రూపాయలు విలువైన సిసి రోడ్లు, సిసి డ్రైన్లను ప్రారంభించారు. అదే విధంగా 19వ వార్డ్‌లో రూ.10.75 లక్షలు, 32, 33 వార్డులలో రూ.48.20 లక్షలు, 34, 35 వార్డ్‌లలో రూ.19.40 లక్షలు మొత్తంగా రూ.78.35 లక్షల విలువైన సిసి రోడ్లు, డ్రైన్‌లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మార్కాపురం పట్టణంలో ప్రతి రోడ్డు సిసి రోడ్డుగా, సీసీ డ్రైన్లను సైతం పూర్తి చేసి మార్కాపురం పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఏఎంసి ఛైర్మన్ మాలపాటి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఇతర నాయకులు, కార్యకర్తలు, ఆయా వార్డుల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.








## ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

(షణ్ముఖ వెలుగు, విజయవాడ, జులై 3)

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షులు శాస్త్రి




అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మనకు రావలసిన మనకు రావలసిన అమౌంట్‌ను తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగ సంఘ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి సహకారంతో రూ.35 లక్షలు తీసుకొని మన రాష్ట్రంలో సొంతంగా రాష్ట్ర కార్యాలయం నిర్మించుకోవడం జరిగింది. ఎందుకు దాతలు సహకారం కూడా ఉన్నదన్నారు. మనకు ప్రభుత్వం నుండి రావలసిన బకాయిల పై మనం ముందు ముందు కాలంలో ఏపీ ఎన్జీవో అమరావతి కలిసి పోరాడవలసిన అవసరం ఉన్న విషయం తెలిసిందే అని తెలిపారు. ఇది మన చివరి కార్యవర్గ సమావేశమన్నారు. ఆగస్టులో నూతన కార్యవర్గం ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రతి జిల్లా నుండి అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు.



ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

04.07.26 శనివారం

# టెక్నాలజీకే అవినీతి మరక....!

- వీడియో కాల్ చేస్తే అటెండెన్స్
- ఉపాధి పనుల్లో అవినీతి టెక్నాలజీ
- సాంకేతికతతో 'మాయ' చేస్తున్నారు
- దొంగ మస్టర్లతో 50% కమీషన్
- క్షేత్ర స్థాయిలో కొరవడిన
- అధికారుల పర్యవేక్షణ
- అర్హత లేని దివ్యంగుల పేరుతో
- నిబంధనలకు పాతర
- ఒకే పని రొండు శాఖల నిధులు
- ఓ రేషన్ కార్డుకు... రొండు జాబ్ కార్డులు
- పాత పనులకు కొత్త బిల్లులు
- అధికారులకు వాటాలు..అందుకే మౌనం





(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 3)

మన అధికారులు ఎంతటి వారినైనా అవినతి చక్రమంలో నిమిషాల్లో దింపేయగలరు. టెక్నాలజీని ఎవరూ మోసం చేయ లేరని చెబుతారు. కాని అటువంటి టెక్నాలజీకి కూడా మన అధికా రగణం అవినీతి మరకను క్షణాల్లో అంటగట్టగలదని నిరూపిస్తు న్నారు. ఉపాధి హామీ పనుల్లో కొత్త టెక్నాలజీ సరికొత్త సమస్యలు సృష్టిస్తోంది. ఇదే టెక్నాలజీ అక్రమార్కులకు వరంలా మారింది. టెక్నాలజీ పెరిగినా దాన్ని అడ్డం పెట్టుకుని సరికొత్త పద్ధతుల్లో దోపిడీకి తెరలేపారు. పనికి వెళ్లకపోయినా హాజరు పడేలా టెక్నా లజీ ఉపయోగిస్తున్నారు. పని ప్రదేశంలో లేకున్నా, ఆ సమయానికి వీడియో కాల్ చేస్తే చాలు మిగతా పనంతా వాళ్లే చూసుకుంటూ వచ్చిన దాంట్లో 50శాతం జేబులో వేసుకుంటున్నారు.

**సాంకేతికతతో ఇలా 'మాయ' చేస్తున్నారు**

ప్రస్తుతం ఉపాధి పనుల్లో ముఖ ఆధారిత హాజరు అమలవుతోంది. అయితే దీన్ని నీరుగారుస్తూ క్షేత్రస్థాయి అధికారి, ఫీల్డ్ అసిస్టెంట్లు, టిఏలు కుమ్మక్కై ఓ ఫేక్ యాప్‌ను వాడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూలీల నివాసాల వద్దే మరో సెల్ ఫోన్ ద్వారా వీడియోలు చిత్రీకరిస్తున్నారు. పని ప్రదేశంలో ఆ వీడియోలోని ముఖచిత్రం, కళ్ళ కదలికల ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు. దీనివల్ల అసలు పని ముఖం చూడని ప్రైవేటు ఉద్యోగులు,సంబంధం లేని వ్యక్తులు కూడా మస్టర్లలో 'హాజరు' అయిపోతున్నారు. ఇలా ఉపాధి హామీ పథకంలో అక్రమాలను నిరోధించేందుకు ప్రవేశపెట్టిన టెక్నాలజీని తమకు అనుకూలంగా మార్చుకున్న తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

**వేతన పంపకాలు**

ఉపాధి హామీ పథకం జూన్ నెలాఖరుతో ముగియనుండగా జులై 1 నుంచి వీబీ జీ రామ్ జీ అమలులోకి రానుంది. ఈ నేపథ్యంలో ఈ నెలలో మిగిలిపోయిన పని దినాలు రద్దయ్యేందుకు అవకాశాలు ఉండడంతో క్షేత్ర, మండల స్థాయి సిబ్బంది, పలువురు అధికారులు కుమ్మక్కై చెయ్యని పనులకు దొంగ కొలతలు వేసి దొంగ మస్టర్లను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు గుప్పుమంటు న్నాయి. పనులు చేసినా, చేయకపోయినా తనకు అనుకూలంగా వుండే వారికి హాజరు వేస్తూ వేతనంలో 50 శాతం కట్ చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అంతా మాయాజాలం..**

ఉపాధి హామీ పనులు అంతంత మాత్రంగానే ఉన్నా పనికి హాజరు కాకపోయిన వారితో ఫీల్డ్ అసిస్టెంట్లు, టిఏలు కుమ్మక్కు అయి కేంద్రం ప్రకటించిన కనీస వేతనం రూ.307లో 85 నుంచి 87శాతం వరకు వచ్చేలా లెక్కలు వేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఉదాహరణకు 50 మంది కూలీలున్న బృందంలో ఒకొక్కరికి రూ.267 వేతనం చొప్పున ఒక రోజు రూ.13,350 విలువైన పని చేసినట్లుగా రికార్డుల్లో చూపిస్తున్నారు. వేసవి కారణంగా ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పరిశీలన కొరవడగా, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇచ్చిన లెక్కలను యథాతథంగా ఆమోదిస్తున్నారు. ఈ కారణంగా పనికి హాజరు కాకపోయిన వారికి సైతం ఎండల్లో చెమటోడ్చే వారికి సమానంగా జీతం రావడం గమనార్హం. ఫీల్డ్ అసిస్టెంట్లుకు కమీషన్లు ఇవ్వని కూలీలకు పని అప్పగించకపోవటం లేదా కూలీలో కోత విధించటం చేస్తున్నారని పలువురు ఉపాధి కూలీలు వాపోతున్నారు.

**వసూళ్ల పర్వం – వాటాల పంపిణీ**

పనికొచ్చే వారి వద్ద నుండి వారానికి రూ. 200, పనికి రాకుండానే హాజరు వేయించుకునే వారి వద్ద నుండి రూ. 400 నుండి 600 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.. దివ్యంగుల పేరుతో బయటవారిని కొంత మందితో జతకట్టి వారితో వంద రోజుల పైగా పని చేయించినట్లు రికార్డులు సృష్టించి వాటాలు వేసు కున్నట్లు విమర్శలు వినబడుతున్నాయి. ఓ రేషన్ కార్డుకి నిబం ధనల ప్రకారం ఓ జాబ్ కార్డు మాత్రమే ఇవ్వవలసి వున్నప్పటికీ మన అధికారులు మాత్రం రొండు, ముడు జాబ్ కార్డులు ఇచ్చి వంద పని దినాలకు పైగా వారు హజరైనట్లు చూపుతూ వారి వద్ద నుండి అధికంగా కమీషన్లు దండుకుంటూన్నారనే విమర్శలు వినబడుతున్నాయి. ఇలా వసూలు చేసిన మొత్తాన్ని క్షేత్రస్థాయి సిబ్బంది నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు వాటాల రూపంలో పంచుకుంటున్నారని చర్చ నడుస్తోంది. అందువల్లనే కింది స్థాయిలో ఏ అధికారి తప్పు చేసినా శిక్ష వేయలేని స్థితిలో జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఉన్నట్లు సమాచారం. మరి ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించి అవినీతి అధికారుల భరతం పడతారో లేదో వేచి చూడాల్సిందే..

**అరోపణల వేల్లువ...**

అక్రమాలను అరికట్టాల్సిన ఆధికారులే ముడుపుల నెపంతో పంచాయతీ నిధులతో చెల్లించవలసిన బిల్లులను ఉపాధి హామీ బిల్లులుగా చూపుతూ, పాత పనులనే కొత్తవిగా చూపుతూ, హాజరు పెంపుతో దొంగ మస్టర్లు వేయిస్తున్నారని, మొక్కలు లేకుండానే హార్టికల్చర్ బిల్లులు చేయడం, లబ్ధిదారుల నుండి నగదు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఓ మేజర్ పంచాయతీ నిధులతో చేయాల్సిన పనికి ఉపాధి హామీ పథకంలో కుడా బిల్లు వసూలు చేసుకుని డబ్బులు దండుకున్నారని, సదరు విషయం ఉపాధి హామీ అధికారులు, మంచినీటి సరఫరా–పారిశు ద్యం శాఖ అధికారులకు తెలిసే జరిగిందని ప్రచారం జోరుగా వినిపిస్తుంది.

**అక్రమార్కుల పై చర్యలు ఏవి**

ఈ అక్రమలపై ఉన్నతాధికారుల వద్ద సమాచారం వున్నను క్షేత్ర స్థాయిలో చర్యలు తిసుకోవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఆధికారులు స్పందించి అక్రమార్కులను గుర్తించి వారి పై చర్యలు తీసుకొని రికవరీ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## దొనకొండ ఇండస్ట్రియల్ పార్కులో బీడీఎల్ ప్రతిపాదిత

# ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించిన కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు, దర్శి, జులై 3)

నియోజకవర్గంలోని దొనకొండ మండల పరిధిలో గల దొనకొండ ఇండస్ట్రియల్ పార్కులో బీడీఎల్ ప్రతిపాదిత ప్రాజెక్టు స్థలాన్ని శుక్రవారం డీఆర్‌డీవో బృందం, జిల్లా కలెక్టర్ పి రాజాబాబుతో కలసి సందర్శించారు. పరిశీలన సందర్భంగా డీఆర్‌డీవో బృందానికి జిల్లా అధికార యంత్రాంగం ప్రాజెక్టు స్థలానికి సంబంధించిన వివరాలు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, భవిష్యత్తు విస్తరణ అవకాశాలు, తదితర అంశాలను వివరించింది. అనంతరం దొనకొండ ఎంపిడిఓ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, బృందం సభ్యులతో సమావేశమై సదరు ప్రాజెక్టు పై చర్చించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు ప్రాజెక్టు వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మీడియాతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా దొనకొండ ఇండస్ట్రియల్ పార్కులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ప్రతిష్ఠా త్మక ప్రాజెక్టుకు సంబంధించి రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ప్రతినిధుల బృందం నేడు ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించినట్లు తెలిపారు. (తరువాయి 4లో...)

# ప్రముఖ పౌరోహితులు లక్ష్మినరసింహ శాస్త్రి గుండెపోటుతో మృతి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 3)

పొదిలి పరిసర ప్రాంతాల్లో విశేష ఆదరణ పొందిన ప్రముఖ పౌరోహితులు పంచాగ్నుల లక్ష్మినరసింహ శాస్త్రి (66) పంతులు శుక్రవారం అకస్మాత్తుగా వచ్చిన గుండెపోటుతో మృతి చెందారు. అనారొగ్యం కారాణాల వల్ల ఒంగోలులోని ఓ ప్రయివేటు వైద్యశాలలో వైద్యం చేయించుకుంటుండగా గుండె పోటు రావడంతో ఈ మృతి చోటు చేసుకుంది. దీంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ సంఘటనతో శాస్త్రి కుటుంబంతో పాటు ఆయన స్నేహితులు, బంధుమిత్రులుల్లో తీవ్ర విషాద వాతావరణం నెలిచింది. ఆయన పౌరోహిత్యం చేస్తున్నంత కాలం నవ్వుతూనే చేస్తూ అందరినీ తన చమత్కారంతో ఎంతటి క్లిష్ట కార్యక్రమాలనైనా సులువుగా చేయిస్తుంటారు. అటువంటి నవ్వుతూ జీవించే శాస్త్రి ఆ నవ్వుతోనే చివరి రోజుల వరకు నిలిచారు. నవ్వుతో పుట్టిన ఆయన ఆ చిరునవ్వుతోనే కన్నుమశారు.... దీంతో పొదిలి పట్టణంలో తీవ్ర విషాదం నెలకొంది.

# పొగాకు రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 3)

పొగాకు పండించే రైతులకు పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. శుక్రవారం ౧కొండపి పొగాకు వేలం కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి, రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వేలం కేంద్రంలో జరుగుతున్న (తరువాయి 4లో...)

# మంత్రి నారా లోకేష్... మాకు చదువును దూరం చేయొద్దు!

- రోడ్డు పై పుస్తకాలు చదువుతూ
- బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులు, తల్లిదండ్రుల వినూత్న నిరసన
- అధికారుల నిర్లక్ష్యంతో 80 మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- 8వ తేదీ నుంచి నిరవధిక దీక్షలకు పిలుపు
- మద్దతు తెలియచేసిన ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు సంఘాలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

మంత్రి నారా లోకేష్ .. మాకు చదువును దూరం చేయొద్దు", "మా భవిష్యత్తు కంటే మ్యూజియం గొప్పదా", బాలుర పాఠశాల్లో హాస్టల్ ఏర్పాటు చేయాలి" అనే ప్లకార్డులు చేతబట్టి, రోడ్డుపై పుస్తకాలు చదువుతూ బీసీ బాలుర ప్రీ–మెట్రిక్ హాస్టల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలెక్టరేట్ ఎదుట వినూత్న నిరసన చేపట్టారు. పేద విద్యార్థుల చదువులను కాపాడాలని (తరువాయి 4లో...)



# కంభంలో ఘోర రోడ్డు ప్రమాదం

- పెళ్లి వేడుకలో పెను విషాదం
- లారీ బీభత్సానికి నలుగురి మృతదేహాలు రోడ్డు పై చెల్లాచెదురు
- రెండేళ్ల చిన్నారి కూడా మృతి

(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 3)

మార్కాపురం జిల్లా కంభం పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఒక కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. పెళ్లి వేడుక కోసం ఆనందంగా బయలుదేరిన కుటుంబ సభ్యుల జీవితాలను అతివేగంగా దూసుకొచ్చిన లారీ క్షణాల్లోనే చిదిమేసింది. గిద్దలూరు నల్లబండ బజార్‌కు చెందిన యువతికి కంభం పట్టణానికి చెందిన యువకుడితో వివాహం నిశ్చయమైంది. వివాహ కార్యక్రమంలో భాగంగా పెళ్లికూతురు కుటుంబ సభ్యులు కొత్త ఆటోలో మొత్తం చిన్నారితో





# మంత్రి నారా లోకేష్... మాకు చదువును దూరం చేయొద్దు!



ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ జరిగిన ఈ నిరసన పలువురిని ఆలోచింపజేసింది. ఒంగోలు నగరంలోని బీసీ బాలుర ప్రీ-మెట్రిక్ హాస్టల్ ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. భవన యజమాని హాస్టల్ ఖాళీ చేయాలని చెప్పడంతో 80 మంది పేద బీసీ విద్యార్థుల చదువులు ప్రమాదంలో పడ్డాయి. ఈ హాస్టల్‌లోని విద్యార్థులు పీవీఆర్ బాలుర పాఠశాలలో చదువుతున్నందున పాఠశాలకు దగ్గరగా ఉండే సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడ చేర్పించారు. హాస్టల్‌ను నగరానికి దూరంగా తరలిస్తే చిన్నారులు ప్రతిరోజూ ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తుందని, చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ వేరే పాఠశాలలో చేర్పించినా కొత్త వాతావరణం, కొత్త ఉపాధ్యాయులు, కొత్త విద్యా విధానానికి అలవాటు పడే వరకు విద్యార్థుల చదువులు దెబ్బతింటాయని తెలిపారు. ఈ సమస్యకు సులభమైన పరిష్కారం ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిరసనకారులు విమర్శించారు. బాలుర పాఠశాలలో ఖాళీగా ఉన్న గదులను స్వల్ప మరమ్మతులతో హాస్టల్‌గా వినియోగించవచ్చని, అయితే ఆ గదులను సైన్స్ మ్యూజియంకు కేటాయించాలని అధికారులు భావించడం విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, కానీ దాని కోసం పాత రిమ్స్ భవనం లేదా ఇతర ప్రభుత్వ భవనాలను వినియోగించవచ్చని సూచించారు. మ్యూజియంకు అనేక ప్రత్యామ్నాయాలు ఉన్నప్పటికీ హాస్టల్‌కు ప్రస్తుతం పీవీఆర్ బాలుర పాఠశాల ఒక్కటే ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను పలుమార్లు కలిసి వినతిపత్రాలు అందజేయగా, ఆయన జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కూడా వినతిపత్రం అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించి అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ, "మా పిల్లల చదువులను కాపాడాలని అడుగుతున్నాం తప్ప మరేమీ కాదు. పేద పిల్లల భవిష్యత్తుతో ప్రయోగాలు చేయొద్దు. మ్యూజియం కోసం మా పిల్లల చదువులను బలి చేయవద్దు" అని భావోద్వేగానికి గురయ్యారు. ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఒంగోలు బీసీ బాలుర హాస్టల్ సమస్యపై వెంటనే స్పందించి విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల విద్యా హక్కును కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం, జిల్లా అధికారులు వెంటనే స్పందించి పీవీఆర్ బాలుర పాఠశాలలో హాస్టల్ కొనసాగింపు పై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుంచి నిరసన దీక్షలు నిర్వహిస్తున్నట్లు దీనికి విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి, అధ్యక్షులు దేవా, పీడీఎస్‌యు నాయకులు శ్యామ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పొగాకు రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



పొగాకు కొనుగోలు ప్రక్రియను, రైతులకు అందుతున్న ధరలను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందని, వేలం ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ఎండనక, వాననక కష్టపడి పంట పండించే రైతన్నలు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులకు కచ్చితంగా లాభసాటి ధర లభించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. వేలం కేంద్రంలో ఏ ఒక్క రోజూ కూడా 'నో బిడ్' (వ్యాపారులు కొనుగోలు చేయకుండా నిలిపివేయడం) అనే పరిస్థితి రాకుండా పొగాకు బోర్డు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిరంతరం నిఘా ఉంచాలని ఆయన ఆదేశించారు. పొగాకు వ్యాపారులు, కంపెనీల ప్రతినిధులు ఉత్సాహంగా వేలంలో పాల్గొని, నాణ్యతకు తగ్గట్టుగా పోటీపడి మంచి ధరలు పలకడం ద్వారా రైతులకు అండగా నిలవాలని మంత్రి పిలుపునిచ్చారు. రైతులకు ఎలాంటి సాంకేతిక లేదా రవాణా ఇబ్బందులు కలగకుండా వేలం కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో పొగాకు రైతులు పాల్గొన్నారు.

# దొనకొండ ఇండస్ట్రియల్ పార్కులో బీడీఎల్ ప్రతిపాదిత ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించిన కలెక్టర్ పి రాజాబాబు



రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, దొనకొండ ఇండస్ట్రియల్ పార్కులో బీడీఎల్ ప్రతిపాదిత ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భూమి, రవాణా అనుసంధానం, నీరు, విద్యుత్ తదితర అంశాలపై డీఆర్‌డీవో బృందం సమగ్రంగా పరిశీలన నిర్వహించిందన్నారు. ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన అన్ని విధాల సహకారాన్ని జిల్లా యంత్రాంగం అందిస్తుందని, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో అవసరమైన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే దొనకొండ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు లభించడంతో పాటు ప్రత్యక్షంగా సుమారు 500 మందికి శాశ్వత ఉద్యోగాలు, పరోక్షంగా 2,000 మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ఆయన అన్నారు. ఈ సమావేశంలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, అద్దంకి ఆర్డీఓ విజయ జ్యోతి, ఎపిఐఐసి జీఎం మదన్ మోహన్‌రావు, పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి గౌస్ బాషా, పారిశ్రామిక శాఖ ప్రతినిధులు, ఏపీఐఐసీ అధికారులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కంభంలో ఘోర రోడ్డు ప్రమాదం







కలిపి 12 మంది కంభం చేరుకున్నారు. వై జంక్షన్‌లోని వినాయకస్వామి ఆలయం వద్ద టెంకాయ కొట్టి పెళ్లికొడుకు ఇంటికి వెళ్లేందుకు హైవే రోడ్డు పక్కన ఆటోను నిలిపారు. ఈ సమయంలో పెళ్లికూతురు ఆలయంలో పూజలు నిర్వహిస్తుండగా, అతివేగంగా వచ్చిన భారీ లారీ రోడ్డుపక్కన నిలిపి ఉన్న ఆటోను అత్యంత వేగంతో బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఆటో పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ఆటోలో ఉన్న అవుల నగేష్ (17), అంకాలు (20), అలకనంద (19), చిన్నారి నాగేశ్వరి (2) లారీ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద తీవ్రతకు వారి మృతదేహాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

## లారీ బీభత్సం ఆటోతో ఆగలేదు....

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, లారీ వేగం ఎంత తీవ్రంగా ఉందంటే ఆటోను ఢీకొట్టిన తర్వాత కూడా ఆగకుండా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంబాన్ని తెంపుకొని ముందుకు దూసుకెళ్లి అక్కడే నిలిపి ఉన్న ఒక కారును ఢీకొట్టి అనంతరం రోడ్డుపక్కన పార్క్ చేసి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను ఈడ్చుకెళ్లి, చివరకు రోడ్డు పక్కన ఉన్న దుకాణంలోకి దూసుకెళ్లడంతో లారీ ఆగింది. దీంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా భయాందోళనలకు గురైంది.

## అందరినీ కన్నీళ్లు పెట్టించిన రెండేళ్ల చిన్నారి నాగేశ్వరి మృతి

లారీ ఆటోను ఢీకొట్టబోతున్నట్లు గమనించిన తల్లి, తన ఒడిలో ఉన్న చిన్నారిని కాపాడాలనే ప్రయత్నంలో వెంటనే బయటకు విసిరేసిందని బంధువులు తెలిపారు. అయితే చిన్నారి రోడ్డుపై బలంగా పడటంతో చిన్నారి మృతి చెందిందని తెలిపారు. ఈ దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. ఈ ప్రమాదంలో మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు, పోలీసులు వెంటనే కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## రాత్రి సమయం కావడంతో తప్పిన మరింత పెను విషాదం...

ఈ ప్రమాదం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి 1.30 గంటల మధ్య చోటుచేసుకోవడంతో రహదారిపై రాకపోకలు తక్కువగా ఉన్నాయి. అదే ప్రమాదం పగటి సమయంలో జరిగి ఉంటే మరింత భారీ ప్రాణనష్టం జరిగేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వరుస రోడ్డు ప్రమాదాలు... స్పందించని అధికారులు

కంభం మీదుగా హైవే నిర్మాణం పూర్తైనప్పటి నుంచి వరుసగా ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ, ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతివేగాన్ని నియంత్రించే చర్యలు, స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ పర్యవేక్షణ వంటి భద్రతా చర్యలను వెంటనే అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరొక అమాయక ప్రాణం బలికాకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కంభం ప్రమాదం పై ఆరా తీసిన జిల్లా కలెక్టర్ మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

మార్కాపురం జిల్లా కంభం పట్టణంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత వెంటనే స్పందించారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకొని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అవసరమైతే బాధితులను మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయ చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగం బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.

# ఇన్సూరెన్స్ కంపెనీకి జరిమానా

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 3)

ఇన్సూరెన్స్ కంపెనీకి జిల్లా వినియోగదారుల కమిషన్ జరిమానా విధించింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పంగులూరు మండలానికి చెందిన కుంచాల శ్రీను భార్య కుంచల రామాంజమ్మ టాటా ఏఐఏ ఇన్సూరెన్స్ కంపెనీ నందు డిసెంబర్ 2022 సంవత్సరంలో సంపూర్ణ రక్ష అనే పాలసీ నందు రూ.20 లక్షలకు ఇన్సూరెన్స్ చేసుకుంది. ఇందుకు గాను రూ.3,122లు ప్రీమియం చెల్లించింది. ఆ తర్వాత తొమ్మిది రోజులకు హార్ట్ ఎటాక్ వల్ల మరణించింది. అనంతరం పాలసీ నామిని అయిన ఆమె భర్త సదరు ఇన్సూరెన్ కంపెనీ వారికి క్లెయిమ్ ఫారం పంపారు. కానీ సదరు ఇన్సూరెన్ కంపెనీ వాళ్ళు పొంతన లేని కారణాలతో క్లెయిమ్ ను తిరస్కరించటంతో ఫిబ్రవరి 2024 సంవత్సరంలో బాధితుడు న్యాయం కోసం జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. వినియోగదారుల కమిషన్ ఫిర్యాదును పరిశీలించి వాదోపవాదనలు విన్న తర్వాత సదరు ఇన్సూరెన్స్ కంపెనీ వారి సేవా లోపంను గుర్తించి పూర్తి క్లెయిమ్ అమౌంట్ రూ.20 లక్షలు 12శాతం వడ్డీతో చెల్లించాలని, అదనంగా మరో రూ.20 వేలు జరిమానా విధించింది. ఫిర్యాదు ఖర్చు క్రింద రూ.5 వేలు ఫిర్యాదుదారుడుకి, అతని కుమారులు ముగ్గురికి సరి సమానంగా 45 రోజులలో చెల్లించవలసిందిగా జిల్లా వినియోగ దారుల కమిషన్ అధ్యక్షులు డి శ్రీదేవి, సభ్యులు వై సుందర్‌రావు, డాక్టర్ సమీరా శుక్రవారం తీర్పునిచ్చారు.

# మధ్యాహ్న భోజనం పరిశీలించిన జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ టి రంగారావు







(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 3)

ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పొదిలి నందు జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ టి రంగారావు విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ టాటా ట్రస్ట్ వారి సహకారంతో మధ్యాహ్న భోజనం పోషకాహార భాండాగారం అనే అంశం మీద పాఠశాలను సందర్శించటం జరిగింది. సందర్శనలో భాగంగా ఉపాధ్యాయు నులకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పాఠశాలలో సుమారు 95% మంది విద్యార్థులు భోజనం చేయడం సంతోషదాయకం అని వారు ప్రశంసించటం జరిగింది. కార్యక్రమంలో విజయ ఫౌండేషన్ ప్రోగ్రాం అసోసియేట్ దాసరి గోపి, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఏ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

## మంత్రి రాంప్రసాద్ రెడ్డి




(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 3)

కంభంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన అత్యంత విషాదకరమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం ఉన్నత ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ప్రభుత్వం ప్రకటించిన పరిహారం, ఇతర సహాయ కార్యక్రమాలు త్వరితగతిన బాధితులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

## ప్రజల కోసం... ప్రజలతోనే ప్రజాదర్బార్



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జులై 3)

యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అర్జీల రూపంలో అర్జీదారుల నుండి తీసుకున్నారు. ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 3)

కందుకూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో, నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం జరగనుంది. పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ నేతలతో కలిసి శుక్రవారం సాయంత్రం సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు వేలాదిగా హాజరవుతారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. తాగునీరు, భోజన వసతులపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నాయకుడు రాయపాటి శ్రీనివాసరావు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీనివాసరావు, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఎనిమిది గేదెల మృతి



(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జులై 3)

మండలంలోని సిద్దవరం గ్రామం నుండి చెర్లోపల్లి పోవు దారిలో 11కెవి విద్యుత్తు వైర్లు తెగిపడ్డాయి. పొలాలకు మేత కోసం వెళ్ళిన గేదెలకు ఆ తీగలు తగలడంతో విద్యుత్‌షాక్‌తో ఎనిమిది గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెల్లో దొడ్డ వెంకటేశ్వర్లు 1, కంది శీను1, పొడుగు పార్టీ శ్రీను2, కేసరి వెంకటరెడ్డి3, కొణిదల గురవయ్యకు సంబంధించిన ఒక గేదె చనిపోయినట్లు గుర్తించారు.

### ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారానికే

# నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్

### జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 3)

క్షేత్రస్థాయిలోనే ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి చెప్పారు. శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ' మీకోసం ' కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 237 అర్జీలు వచ్చాయి. వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఒక నెలలో ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో నాలుగు సార్లు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించడ ద్వారా క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం మొత్తం ఈ విధంగా క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ' మీకోసం ' అర్జీలకు సత్వరం సహేతుక పరిష్కారం చూపేందుకు



దృష్టి సారించామన్నారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె చెప్పారు. ఆయా విషయాలలో తహసీల్దారులు, ఆర్డీవోలకు మార్గ నిర్దేశం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సర్కులర్ కూడా జారీ చేసిందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం మొత్తం ప్రజా క్షేత్రంలోకి రావడం మంచి పరిణామం అన్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. రైతులు ఎక్కువగా ఈ నియోజకవర్గంలో ఉన్నందున వారి పొలాలకు సంబంధించిన విస్తీర్ణ, ఆన్లైన్ సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటన్నింటిపై దృష్టి సారించి పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పి వెంకటరమణ, సబ్ కలెక్టర్ డి హిమవంశీ, జడ్పీ సీఈవో చిరంజీవి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.







## కనిగిరి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు సామర్థ్యాభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 3)

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో, నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సహకారంతో కనిగిరి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు సామర్థ్యాభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు పట్టణ పరిశుభ్రతకు వెన్నెముకలని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో వారి పాత్ర ఎంతో కీలకమని, విధి నిర్వహణలో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ వ్యక్తిగత రక్షణ పరికరాలు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. అలాగే తడి, పొడి, గృహ ప్రమాదకర వ్యర్థాలను మూలం వద్దనే వేరు చేయించడం ద్వారా పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నయాబ్ రసూల్ మాట్లాడుతూ రోజువారీ పారిశుద్ధ్య కార్యకలాపాల్లో నాణ్యత, సమయపాలన ,ప్రజలతో మర్యాదపూర్వక వ్యవహారం అత్యంత అవసరమని తెలిపారు. పరిశుభ్రతతో పాటు కార్మికుల భద్రతకు కూడా




సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఏఐఐఎల్ఎస్‌జీ రీసోర్స్ పర్సన్ దత్తం కోటేశ్వరరావు శిక్షణను నిర్వహిస్తూ ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, మూలం వద్ద వ్యర్థాల వేరు చేయడం, వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, ఆరోగ్య భద్రత, పరిశుభ్రత ప్రమాణాలు, స్వచ్ఛ సర్వేక్షణ్ లక్ష్యాలు, ఆర్ఆర్ఆర్ కేంద్రాలు, ఎంఆర్ఎఫ్ సెంటర్ల ప్రాముఖ్యత, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణపై సమగ్ర అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న కార్మికుల సందేహాలకు సమాధానాలు ఇస్తూ క్షేత్రస్థాయిలో పాటించాల్సిన ఉత్తమ పద్ధతులను వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు ఉత్సాహంగా పాల్గొని, తమ విధుల్లో మరింత సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన నైపుణ్యాలు, అవగాహనను పెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్య కార్మికుల సామర్థ్యాన్ని పెంపొందించి, కనిగిరి పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, ఏఐఐఎల్ఎస్‌జీ సంయుక్తంగా కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## కందుకూరు ప్రాంతంలో లెక్కలేనన్ని రెవెన్యూ సమస్యలు కొందరు అధికారులు పనితీరు సరిగా లేదు

### సిబ్బంది నిర్లక్ష్యం పట్ల కోపం, బాధ వస్తున్నాయి
### రైతుల ఆవేదనను అర్థం చేసుకోండి
### అవన్నీ సరి చేయాల్సిన బాధ్యత మీదే
### అధికారులకు సూచించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు




(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 3)

కందుకూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం శుక్రవారం జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి తమ సమస్యల పై అర్జీలు ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ 147 అర్జీలు స్వీకరించి సమస్యలను విన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ లింగసముద్రంలో ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహిస్తే 90 శాతం అర్జీలు రెవిన్యూ సమస్యల పై వచ్చాయన్నారు. నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి ఉంది. పట్టా భూములు, అసైన్డ్ భూములు అన్న తేడా లేకుండా ఆన్లైన్‌లో అక్రమాలకు పాల్పడ్డారు. క్రింది స్థాయి రెవిన్యూ సిబ్బంది ఇష్టం వచ్చినట్లు తప్పులు చేశారు. రికార్డులు మొత్తం తారుమారు చేశారు, కొన్నిచోట్ల వాటిని మాయం చేసారు కూడా. రెవెన్యూ సిబ్బంది చేసిన తప్పులకు రైతులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములు ఆన్లైన్‌లో వేరొకరి పేరుమీద ఉంటే, ఆ రైతుల ఆవేదన ఎలా ఉంటుందో ఆలోచించండి. బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. అధికారుల నిర్లక్ష్యానికి నాకు కోపం, బాధ రెండూ వస్తున్నాయి. ఎన్నిసార్లు చెప్పినా కొంతమంది అధికారుల తీరులో మార్పు రావడం లేదు. ఆ తప్పులన్నీ సరిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. గ్రౌండ్ లెవెల్ అధికారులు వారి చేతుల్లో ఉన్నంతలో సమస్యలను పరిష్కరించండి. రైతులను పదేపదే తిప్పుకోవద్దని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# దళితుల, క్రిస్టియన్ సోదరుల పెన్నిధి కందుల నారాయణరెడ్డి



## రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 3)

ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలైన మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్, మహాజన సోషల్ పార్టీ, దళిత క్రిస్టియన్ ఐక్యవేదిక నాయకులు శుక్రవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని గౌరవపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షులు బొంత ఏసుదాసు, ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బిక్షాలు, ఎంఈఎఫ్ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు కత్తి ఐజాక్, ఎంఎస్పీ జాతీయ ఉపాధ్యక్షులు ఎలగంటి నర్సింగ్, ఎంఎస్పీ ఉపాధ్యక్షులు కొరళ్ళ దేవదాస్, ఎంఎస్పీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు తొరటి ఆనంద్, ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు నెలపాటి రాజు, ఎంఆర్పీఎస్ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి ఉదయ్, ఎంఆర్పీఎస్ మార్కాపురం నియోజకవర్గం ఇంచార్జి పందిటి కాశీరావు, దళిత క్రిస్టియన్ ఐక్యవేదిక నాయకులు,పొదిలి మండల చర్చి సంఘ పాస్టర్, సంఘ కమిటీ సభ్యులు తదితరులు కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గారు దళిత క్రిస్టియన్ సోదరుల వెన్నంటే ఉండి వారికి ఏ కష్టం వచ్చినా తానున్నానని ఆదుకుంటున్నారని అడిగిన వెంటనే ఒక నిమిషం కూడా ఆలోచించకుండా దళిత మరియు క్రిస్టియన్ సోదరుల పని చేసి పెడుతున్నారు అని, దళిత , క్రిస్టియన్ సోదరుల పట్ల అత్యంత ప్రేమ కలిగి ఉండి ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటున్నారని ఎప్పుడు ఏ పని వచ్చిన తనను ఏ సమయంలోనైనా కలవవచ్చని అన్నారన్నారు. ఇంతకు ముందు ఏ ప్రజా ప్రతినిధి ఈ రకంగా దళితులు, క్రిస్టియన్లను ప్రోత్సహించలేదన్నారు. దీనికి ఉదాహరణ 1.7.2026న ఏబీఎం హైస్కూల్‌ను భూ బకాసురుల కోరల నుండి కాపాడి తిరిగి ఏబీఎం స్కూల్‌ను ప్రారంభించటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, దళిత, క్రిస్టియన్ సంఘాల నాయకులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.



# రాజువారిపేటలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

## ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### నక్కలదిన్నె వైద్యాధికారి డాక్టర్ పి ఓబులేసు





(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 3)

దోమల వల్ల కలుగు వ్యాధుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, డెంగ్యూ రహిత సమాజాన్ని నిర్మించడమే మన అందరి లక్ష్యం కావాలని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి ఓబులేసు పిలుపునిచ్చారు. చాపాడు మండలంలోని అయ్యవారిపల్లె సచివాలయ పరిధిలో గల రాజువారిపేట గ్రామంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యాధికారి డాక్టర్ పి ఓబులేసు ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ, లార్వా సర్వే, మరియు ఫీవర్ సర్వేలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ఓబులేసు మాట్లాడుతూ, దోమల నివారణకు ప్రజలందరూ బాధ్యత వహించి తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్లలోని సిమెంటు తొట్లు, డ్రమ్ములు, ఎయిర్ కూలర్లు, ఫ్రిడ్జ్ వెనుక భాగం, పాత టైర్లు, వాడి పడేసిన కొబ్బరి బొండాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒకసారి నీటి నిల్వలను తప్పనిసరిగా తొలగించి 'ఫ్రైడే-డ్రై డే' పాటించాలని స్పష్టం చేశారు. దోమకాటు నుండి ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం రాఘవయ్య, డిప్యూటీ హెచ్ఈఓ జయప్రకాశ్, హెల్త్ సూపర్ వైజర్లు ప్రసాద్, భవానీ, ఆశా కార్యకర్త పార్వతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వైద్యానికి ఆర్థిక అంతరం లేకుండా

## పేదలకు అండగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

### నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో రూ.1.52 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 3)

ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మైదుకూరు నియోజకవర్గానికి చెందిన 134 మంది లబ్ధిదారులకు శుక్రవారం రూ.1,52,71,289 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పంపిణీ చేశారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితులకు ఎలాంటి ఫైనాన్స్ గ్యాప్ లేకుండా ఈ సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంతో వైద్యానికి దూరం కాకుండా ప్రతి ఒక్కరికీ మేలు చేయడమన్నారు. ఏ ఒక్క పేదవాడు ఆర్థిక స్తోమత లేక, వైద్యానికి ఫైనాన్స్ గ్యాప్ వచ్చి ఇబ్బంది పడకూడదన్నదే మా సంకల్పమన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ సాయం నేరుగా చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న తమకు, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇంత పెద్ద మొత్తంలో చెక్కులను మంజూరు చేయించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నేతలు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై న్యాయవిచారణ జరిపించాలి

## మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలి

### అఖిలపక్ష కార్మిక సంఘాలు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 3)

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై న్యాయవిచారణ జరిపించాలని, మృతుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం, క్షతగాత్రులకు రూ.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని జూలై 3 కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసనలో కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ నిరసనలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం రమేష్, ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి కె వెంకటేశ్వర్లు, ఎఐయఫ్‌టియు జిల్లా నాయకులు యం యస్ సాయి, ఐయఫ్‌టియు రాష్ట్ర నాయకులు మోహన్, ఎపిఆర్‌పిఎ జిల్లా నాయకులు టివి సుబ్బారావు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పోరేట్ అనుకూల ప్రవేటీకరణ విధానాలే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదానికి ప్రధాన కారణమన్నారు. 1500 డిగ్రీల వేడి కల్గిన లిక్విడ్ లాడెల్ ద్వారా తరలించటంలో అత్యంత బధ్రతా ప్రమాణాలు పాటించటంలో యాజమాన్యం,ప్రభుత్వం నిర్లక్ష్యమే 10 మంది కార్మికులు మృతికి కారణమైందన్నారు.యంత్రాల నిర్వహణలో నిర్లక్ష్యం, అనుభవజ్ఞులైన సిబ్బందిని తొలగించడం, కార్మికులపై అధిక పనిభారం మోపడంతోనే తరచూ ప్రమాధాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రమాధంపై న్యాయవిచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, ప్రమాధంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాడ్ చేసారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలను తక్షణమే నిలిపివేసి, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో సీఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, జిల్లా నాయకులు సిహెచ్ మజుందార్, జి శ్రీనివాసులు, జి రమేష్, పి శ్రీనివాసులు, ఒంగోలు నగర నాయకులు బివి రావు, దామా శ్రీనివాసులు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, జిల్లా నాయకులు యస్‌డి సర్ధార్, యు ప్రకాశరావు, పోలేరయ్య, ఎఐయఫ్‌టియు జిల్లా నాయకులు కె హనుమంతరావు, యస్‌కె సుల్తాన్ బాషా, ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి శేషయ్య, సి హెచ్ రాంబాబు పాల్గొన్నారు.

# ఒంగోలులో జ్ఞాన జ్యోతి ఇయర్ 3 డీఆర్‌పీల శిక్షణా కార్యక్రమం ప్రారంభం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

ఒంగోలులోని సెయింట్ థెరిస్సా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జూలై 3 నుండి జూలై 4 వరకు నిర్వహించనున్న జ్ఞాన జ్యోతి ఇయర్ 3 డీఆర్‌పీల శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారిణి సివి రేణుక ప్రారంభించారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్), ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ), స్టేట్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (ఎస్‌ఏ ఎల్‌టి) ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో ఎస్సీఈఆర్టీ, అసర్, ప్రథం సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న ఈ 120 రోజుల జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల డీఆర్‌పీల శిక్షణను జిల్లా విద్యాశాఖ అధికారి సి వి రేణుక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాల పెంపొందింపులో అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. బాల్యంలోనే సుమారు 80 శాతం మేధో వికాసం జరుగుతుందని, అందువల్ల ప్రారంభ బాల్య విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.గత విద్యా సంవత్సరంలో ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాల సాధనలో ప్రకాశం జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని,ఇదే స్ఫూర్తితో ఈ విద్యా సంవత్సరంలో కూడా ఉపాధ్యాయులందరూ నిబద్ధతతో పనిచేసి జిల్లాను మరోసారి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంఐఎస్ కోఆర్డినేటర్ జాలరత్నం, ఏఎంఓ నాగేంద్ర నాయక్, మండల విద్యాశాఖ అధికారి టి కిషోర్ బాబు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్‌గా వాణి, బి వెంకటేశ్వర్లు, ఎలిజబెత్ రాణి శిక్షణ నిర్వహించారు. శిక్షణలో స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం నుంచి 66 మంది ఉపాధ్యాయులు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ నుంచి 61 మంది సూపర్వైజర్లు, సీడీపీఓలు పాల్గొన్నారు. జ్ఞాన జ్యోతి కార్యక్రమ లక్ష్యాలను గ్రామీణ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన అంశాలపై వారికి సమగ్ర శిక్షణ అందించారు.ఈ శిక్షణ ద్వారా చిన్నారుల్లో పునాది స్థాయి చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రారంభ బాల్య విద్యను నాణ్యంగా అమలు చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# మహేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

## నాయీ బ్రాహ్మణ ఐక్య సంఘాల నాయకులు డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

ఒంగోలు నగరంలో గురువారం దారుణహత్యకు గురైన గరిటపల్లి మహేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నాయీ బ్రాహ్మణ ఐక్య సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐక్య సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా భారతీయ నాయిబ్రాహ్మణ ఐక్య వేదిక కన్వీనర్ మద్దులూరి శ్రీనివాసులు మాట్లాడుతూ మహేంద్ర అనే వ్యక్తి కుటుంబ పోషణ కోసం నాలుగు రోజుల క్రితం గుడివాడ నుండి ఒంగోలు వచ్చారన్నారు. 60 అడుగుల రోడ్డులో గల మస్తాన్ హోటల్‌కి సమీపంలోఉన్న శ్రీనివాస బార్బర్ షాపులో పనిచేస్తున్న సమయంలో రామారావు అనే వ్యక్తి మద్యం సేవించి వచ్చి తనకు షేవింగ్ చేయాలని కోరగా, తర్వాత చేస్తానని చెప్పడంతో పక్కనే ఉన్న కత్తెర తీసుకొని మెడ మీద పొడిచి దారుణంగా చంపాడన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సమన్వయ కమిటి రాష్ట్ర కన్వీనర్ ధరణికోట లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మద్యం తాగిన వ్యక్తికి గడ్డం చేయడం కష్టంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో తర్వాత చేస్తానని చెప్పిన మహేంద్రను రామారావు కిరాతకంగా హత్య చేశారన్నారు. బీసీలకు ప్రభుత్వం రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నగర క్షౌరశాల సంఘం అధ్యక్షుడు కొణిజేటి రామకృష్ణ మాట్లాడుతూ మహేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో మిరియం శ్రీనివాసరావు, బొట్ల సుబ్బారావు, కుట్టుబోయిన కోటి యాదవ్, చల్లా హరి, నాయి బ్రాహ్మణ సంఘ గౌరవ అధ్యక్షుడు అబ్రహం బాబు, నగరంలోని బార్బర్ షాప్‌లో పనిచేసే వర్కర్స్ పాల్గొన్నారు.





## కంభం రోడ్డు ప్రమాదంపై మంత్రి స్వామి దిగ్భ్రాంతి



(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 3)
గిద్దలూరు నియోజకవర్గం కంభం రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై మంత్రి స్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం ఉన్నత ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చిన మంత్రి స్వామి, ప్రభుత్వం ప్రకటించిన సహాయ చర్యలు త్వరితగతిన బాధితులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటాం

### ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 3)
మార్కాపురం జిల్లా కంభం పట్టణంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు త్వరితగతిన అందేలా అధికారులతో చర్చించినట్లు తెలిపారు. అలాగే ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రహదారి భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

## మద్యం మత్తే ప్రాణం తీసింది

### పొట్ట నిండా మద్యం తాగి ప్రాణం తీసుకున్న అంబటి వెంకటేశ్వరరెడ్డి



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జూలై 3)
మద్యం మత్తులో ప్రమాదవశాత్తు జారిపడి ఓ లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన పుల్లలచెరువులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం రేమిడిచెర్ల గ్రామానికి చెందిన అంబటి వెంకటేశ్వరరెడ్డి (44) ప్రస్తుతం పుల్లలచెరువు మండలం ఆర్ ఉమ్మడివరం గ్రామంలో నివాసం ఉంటూ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జూన్ 29 రాత్రి నుంచి జూన్ 30 ఉదయం మధ్య పుల్లలచెరువు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల సమీపంలో మలవిసర్జనకు వెళ్లిన సమయంలో మద్యం మత్తులో ప్రమాదవశాత్తు జారిపడి చెట్టుకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి మద్యం సేవించే అలవాటు ఉండేదని, పలుమార్లు మద్యం మత్తులో ఎక్కడపడితే అక్కడ పడిపోయి తర్వాత ఇంటికి చేరుకునేవాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య అంబటి బాలమ్మ శుక్రవారం పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూలై 3)
పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో మార్కాపురం మండలంలోని కృష్ణాపురం గ్రామ రెవిన్యూ సంబంధించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి శు



క్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణాపురం గ్రామానికి సంబంధించి పగడ్బందీగా రీ సర్వే నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని కూటమి ప్రభుత్వంలో పరిపాలన అత్యంత పారదర్శకంగా ఉంటుందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో వైసీపీ నాయకుల కనుసన్నల్లో శాఖలో అత్యంత దుర్మార్గంగా వ్యవహరించారని, వాటిని జాగ్రత్తగా చూసి నిజమైన రైతులకు న్యాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సోదరులు, రెవిన్యూశాఖ అధికారులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## అసైన్‌మెంట్ భూముల సమస్య పై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన దళిత హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గోన దానయ్య

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూలై 3)
వెలిగండ్ల మండలం, గుడిపాటిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పందువ రెవెన్యూ పరిధిలో పేద దళితులకు కేటాయించిన అసైన్‌మెంట్ భూముల సమస్యపై దళిత హక్కుల వేదిక మార్కాపురం జిల్లా అధ్యక్షుడు గోన దానయ్య శుక్రవారం మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతకు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రత్యేక పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌ను వ్యక్తిగతంగా కలిసి ఈ వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గోన దానయ్య కలెక్టర్‌కు వివరిస్తూ పందువ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 1148/3, 1161, 579, 458, 459, 465/4, 458, 390, 453, 461, 551, 575, 550, 579, 470/2, 1116, 737, 1219/2, 1172, 321, 1150, 377, 378, 577, 1083/1, 1516/3, 389, మరికొన్ని సర్వే నెంబర్లలోని భూములను గతంలో అసైన్‌మెంట్ కమిటీల ద్వారా పేద ఎస్సీలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. గతంలో జిల్లా కలెక్టర్ స్వయంగా గ్రామాన్ని సందర్శించి, అధికారులను త్వరితగతిన భూమిని గుర్తించి లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని ఆదేశించినప్పటికీ, స్థానిక రెవెన్యూ అధికారులు నేటికీ స్పందించకుండా, పొజిషన్ చూపించకుండా జాప్యం చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పేద దళితులకు కేటాయించిన భూమిని గుర్తించి, వారికి ఇప్పించి వారి జీవనోపాధికి బాటలు వేయాలని కోరారు.

**కలెక్టర్ సానుకూల స్పందన...**

దళిత హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గోన దానయ్య సమర్పించిన వినతి పై మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత సానుకూలంగా స్పందించారు. ఈ విషయం పై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, అర్హులైన పేద దళితులకు ఖచ్చితంగా న్యాయం చేస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.





## ఎన్యూమరేషన్ ఫారంలో తమ వివరాలను నమోదు చేసి త్వరితగతిన అందించాలి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు, సంతమాగులూరు, జూలై 3)
ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ -2026 కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫారంలో తమ వివరాలను నమోదు చేసి త్వరితగతిన అందించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని ఏల్చూరు స్వర్ణవార్డు సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్ళి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమం ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రజలకు జిల్లా కలెక్టర్ అవగాహన కలిగించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్-2026 ప్రక్రియ జులై 14, 2026 వరకు కొనసాగుతుందని, ప్రతి బూత్ లెవెల్ అధికారి, తమ పోలింగు కేంద్రం పరిధిలో ప్రతి ఇంటిని సందర్శించి గణన ఫారంను ఓటర్లకు అందజేశారన్నారు. ప్రజలు ఫారం పూర్తిచేసి బిఎల్వోలకు అందజేయ్యాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడం, అదేసమయంలో అనర్హులైన వ్యక్తులు పేర్లు ఓటరు జాబితాలో చేరకుండా ఉండడం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ యొక్క ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఈ ప్రక్రియ నిర్దేశించిన సమయంలో పూర్తి అయ్యేందుకు ప్రజలు సహకారం అతి ముఖ్యమని, ఎన్యూమరేషన్ ఫారంలో వివరాలు నింపి బిఎల్వోలకు అందించాలని ప్రజలను కోరారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట అద్దంకి ఆర్డిఓ విజయ జ్యోతి, తహశీల్దార్ రవి, సూపర్వైజర్లు, బీఎల్వోలు, తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ నాయీ బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన చట్టాల మాదిరి రక్షణ నాయి బ్రాహ్మణులకు కల్పించాలని డిమాండ్

నాయీ బ్రాహ్మణు లపై దాడులు నశించాలని ఖండన





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 3)
ఈ నెల 2వ తేదీన ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఓ బార్బర్ షాపులో కమీషన్ పద్దతిలో పనిచేస్తున్న గుడివాడ మహేందర్ (45) పై రామారావు అనే వ్యక్తి షాపులోని కత్తెరతో గొంతులో పొడిచి చంపిన ఘటన పై గిద్దలూరు పట్టణంలో నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంథరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వి ఆంజనేయ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అలాగే మహేందర్ చావుకు కారణమైన రామారావును కఠినంగా శిక్షించాలని, ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న రక్షణ చట్టాల మాదిరి తమకు రక్షణ కల్పించే విధంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు తొండమల్లు బ్రహ్మయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ పృదులగిరి లక్ష్మీనరసింహస్వామి పాలకమండలి సభ్యులు

శివరాజు దంపతులకు శాలువా, పూలమాలతో సత్కారం



(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జులై 3)
శ్రీ పృథులగిరి లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం పాలకవర్గ సభ్యురాలిగా ఎన్నికైన గీతా సౌభాగ్య లక్ష్మిని, శివరాజు శ్రీనివాసరావు దంపతులను డాక్టర్ మణి ఆధ్వర్యంలో ఘనంగా శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షులు శింగంపల్లి సుబ్బారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మునగాల రమణకిషోర్, వెలగపూడి సురేష్‌బాబు, తురిమెళ్ళ సాయిరామ్ కలిసి అభినందనలు తెలిపారు.

## కేంద్ర మంత్రిని కలిసిన ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)
కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ భీమవరం నుండి కడపకు బయలుదేరి మార్గం మధ్యలో శుక్రవారం ఉదయం ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కాలేజీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## బ్రహ్మంగారి మఠంలో మరో వివాదం మేనేజర్ నియామక ఉత్తర్వులను రద్దు చేసిన దేవాదాయ శాఖ





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జూలై 3)**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠంలో వివాదాలు ముగింపు లేకుండా సాగుతున్నాయి. అనేక ఉత్కంఠభరిత పరిణామాలు, వివాదాల మధ్య వెంకటాద్రి స్వామి పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, అక్కడ ప్రతి పదవి ఒక మలుపుగా మారుతోంది. తాజాగా మఠం మేనేజర్ ఉద్యోగం మరో పెద్ద వివాదానికి తెరలేపింది. బ్రహ్మంగారి మఠం మేనేజర్‌గా జూలై 2న పిపిఎన్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. అయితే, అంతలోనే పీఠాధిపతి ఇచ్చిన ఆ నియామక ఉత్తర్వులు చెల్లవంటూ దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ శుక్రవారం వాటిని కొట్టివేశారు. తన పై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కనీసం వివరణ కూడా తీసుకోకుండా ఏకపక్షంగా ఉత్తర్వులను రద్దు చేశారని పిపిఎన్ ప్రసాద్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంప్రమైజ్ డిక్రీలో 'ముందస్తు అనుమతి' అనే పదమే లేనప్పటికీ, కావాలనే ఆ వాక్యాన్ని చేర్చి తప్పుడుగా తనను సస్పెండ్ చేశారని ప్రసాద్ ఆరోపించారు. ఈ అన్యాయమైన సస్పెన్షన్, ఉత్తర్వుల రద్దు పై తాను వెనక్కి తగ్గేది లేదని, న్యాయం కోసం న్యాయస్థానాన్ని (కోర్టును) ఆశ్రయించి చట్టపరంగా పోరాడతానని పిపిఎన్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ పరిణామాలతో బ్రహ్మంగారి మఠంలో దేవాదాయ శాఖ వర్సెస్ మఠం నిర్వాహకుల మధ్య వివాదం మరింత ముదిరేలా కనిపిస్తోంది.

# క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే సోదరుడు

## ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మట్టి ఖర్చులకు 50 వేలు సాయం
## మృతుల కుటుంబసభ్యులను ఫోన్లో పరామర్శించిన ఎమ్మెల్యే ముత్తుముల



**(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 3)**

గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రయాణిస్తున్న వాహనం మార్కాపురం జిల్లా కంభం పట్టణం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదానికి గురికావడం అత్యంత విషాదకరమని తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ఆదేశానుసారం క్రిష్ణ కిశోర్‌రెడ్డి కంభం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతులను, క్షతగాత్రులను పరామర్శించినారు అనంతరం ప్రమాద సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరు పరిశీలించారు. ఈ ప్రమాదంలో గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజార్, జంగాల్ కాలనీకి చెందిన నలుగురు మృతి చెందడం, మరో ఆరుగురు




గాయపడడం పట్ల క్రిష్ణ కిశోర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పెళ్లి కార్యక్రమానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరగడం ఎంతో బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ బాధిత కుటుంబాలకు మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ.50,000లు ఎమ్మెల్యే ఆదేశానుసారం వారి సోదరుడు క్రిష్ణ కిశోర్‌రెడ్డి అందించారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయం అందేలా కృషి చేస్తామని క్రిష్ణ కిశోర్ గారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నల్లబండబజార్ 17 వార్డు అధ్యక్షులు పిడతల రవి, రాష్ట్ర ఐటీడీపి కార్యనిర్వహణ కార్యదర్శి దూదేకుల దస్తగిరి, కంభం మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ సంచులు విడనాడదాం ప్రత్యామ్నాయలవైపు పయనిద్దాం

## ప్రపంచ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్ వ్యతిరేక దినోత్సవ సందర్భంగా పిలుపు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 3)**

క్యాన్సర్ కారక ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను విడనాడాలని, ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, జ్యూట్ సంచులను వినియోగించాలని ఆ దిశగా ప్రజలు పయనించాలని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి వీరభద్రాచారి పిలుపునిచ్చారు. జూలై 3 ప్రపంచ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్ వ్యతిరేక దినోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని ప్లాస్టిక్ భూతం వేధిస్తుందని పర్యావరణాన్ని హరిస్తుందని ప్రజలను క్యాన్సర్ వ్యాధికి గురి చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ మన నిత్య జీవితంలో ప్రధాన భాగమైపోయిందని దీనిని నివారించడానికి, నిరోధించడానికి ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి రోజు మార్కెట్ కి వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్ ను విడనాడి, జ్యూట్ బ్యాగ్, లేదా గుడ్డ సంచిని వినియోగించాలని తద్వారా మార్కెట్ నుండి వస్తువులను తీసుకొచ్చుకోవాలని ఇది ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు. ప్రతిరోజు కొన్ని వేల టన్నుల ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగం జరుగుతుందని దీని వలన మిగిలిపోయిన ఆహారాన్ని క్యారీ బ్యాగుల ద్వారా తినడం ద్వారా ఆవులు, గేదెలు మేకలు, అవి తిని అనారోగ్యం పాలవుతున్నాయని అన్నారు. క్యారీ బ్యాగులు వినియోగం ద్వారా క్యాన్సర్ మహమ్మారి ప్రజల ప్రాణాలను కబళిస్తుందని అన్నారు. క్యాన్సర్ కారక క్యారీ బ్యాగులను తక్షణమే ప్రజలు తమకు తాముగా నిషేధించాలని వాటి వినియోగాన్ని విడనాడాలని ఆయన కోరారు. పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజలు చైతన్యం అవుతున్నప్పటికీ పాలకులు, అధికారులు ప్లాస్టిక్ వ్యతిరేక చట్టాలను అమలు చేయడంలో వైఫల్యం చెందుతున్న తీరుతో ప్లాస్టిక్ ఇంకా ప్రజల మధ్యన తిరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మితిమీరిన ప్లాస్టిక్ వినియోగం వలన మన దేశంలో క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారని, ప్రతి వెయ్యి మందిలోఒకరు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులుగా ఉన్నారని, ప్రతి గంటకు ఇద్దరు క్యాన్సర్ వ్యాధితో మరణిస్తున్నారని అనేక సర్వేలు చెబుతున్నాయని, దీని పై ప్లాస్టిక్ నివారణ, నియంత్రణ కోసం ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఉన్న చట్టాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సంస్థ సభ్యులు గుంటూరు మస్తాన్‌రావు, కె ఆదినారాయణ, ఎస్ భాస్కర్‌రావు, ఎం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాలుని దర్శించుకున్న ఎస్ఐ శివ బసవరాజు







**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూలై 3)**

తర్లుపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఈవో కొప్పులకోటిరెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కరరావుల ఆహ్వానం మేరకు ఎస్ఐ సిహెచ్ శివబసవ రాజు ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన పెద్దలు, గ్రామ పెద్దలు అందరూ ఎస్ఐని గౌరవ పూర్వకంగా సాదరంగా ఆహ్వానించారు. దీంతో ఆలయ పూజారులు ఓరుగంటి ప్రసాద్, కారంపూడి సాయిలు ఆయనకు సాంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛారణ గావించి ఘనంగా పూజలు నిర్వహించి దేవుని ఆశీర్వాదాలు పొందడం జరిగింది. ముందుగా ఆలయ ప్రాంగణ ప్రవేశంలోనే అందరూ ఎస్ఐకి ఘన స్వాగతం పలికారు. దేవుని ప్రదర్శన అనంతరం ఎస్ఐని ఆలయ ఈవో కొప్పుల కోటిరెడ్డి, ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయభాస్కరరావులు, గ్రామ పెద్దలు, మహిళలు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కొప్పుల కోటిరెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కరరావు, జవ్వాజి వెంకటేశ్వర్లు, పోలేపల్లి జనార్దన్‌రావు, సిహెచ్ శ్రీనివాసులు టీచర్, సిహెచ్ సుబ్రమణ్యం, పార్లపల్లి ప్రసాదరావు, సూరెడ్డి రామసుబ్బారెడ్డి, కోలగట్ల కాశీశ్వరరెడ్డి, బాసాని గాలిరెడ్డి, కాలంగి శ్రీనివాసులు, గోసు వెంకటేశ్వర్లు మాజీ మెంబర్, గోసు వెంకటేశ్వర్లు ఎంఆర్‌సి, భవనం రామకృష్ణారెడ్డి, సిహెచ్ సుబ్రహ్మణ్యం, కుందురు చిన్నకాశిరెడ్డి, కోలగట్ల కృష్ణారెడ్డి, దొడ్డా సుబ్బారెడ్డి, సూరే సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 3)**

ఒంగోలులో మంగమూరు రోడ్డు మర్రిచెట్టు దగ్గర సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ శుక్రవారం ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించడమే ఈ దర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి మొత్తం 40 అర్జీలు అందాయి. ప్రతి ఒక్కరి అర్జీని స్వయంగా స్వీకరించిన ఎమ్మెల్యే వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణ అనుమతులు, రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు వంటి అంశాలకు సంబంధించిన అర్జీలు అధికంగా రావడంతో, వెంటనే రెవెన్యూ అధికారులతో చర్చించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టారు. ఇతర విభాగాలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులకు సూచనలు ఇవ్వగా, ఎక్కువశాతం సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం చేశారు. ప్రజా సమస్యలను సాంకేతిక,ఆర్థికపరంగా పరిశీలించి వేగంగా పరిష్కరించేందుకు పని చేస్తానని ప్రజలకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్), ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, నల్లూరి శ్రీను, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.









On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# విట్లాపురం, శివరాంపురం సాక్షులను విచారించిన దర్శి డిఎస్పి

## బొగ్గ, కురిచేటి ముఠాలను అరెస్టు చేయాలని నీలం డిమాండ్



(షణ్ముఖ వెలుగు, దర్శి, జులై 3)

తాళ్లూరు మండలంలోని విట్లాపురం, శివరాంపురం ఎస్సీ, ఎస్టీ కేసుల్లో దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ దళిత నాయకుల సమక్షంలో విచారణ జరిపారు. శుక్రవారం తాళ్లూరు పోలీస్ స్టేషన్కు విచ్చేసిన దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ విట్లాపురం గ్రామంలో ఎస్టి యానాది కులానికి చెందిన చేవూరు మౌనిక తదితరుల నాలుగున్నర సెంట్లు ఇంటి స్థలాన్ని రజక కులానికి చెందినవారు కురిచేటి శ్రీను కుటుంబ సభ్యులు బహిర్భూమి స్థలాన్ని ఆక్రమించు కోవటమే కాకుండా లెట్రిన్ స్థలాన్ని కూడా వాడుకోనీయకుండా రణరంగం చేశారన్నారు. యానాదులు నడవకుండా ముళ్ళకంప వేసి రహదారిని కూడా మూసివేసి అంటరానితనం పాటించారన్నారు. స్థానిక అగ్రకులాల మద్దతుతో కురిచేటి శ్రీను కుటుంబ సభ్యులు రజకులు అయినప్పటికీ సాటి యానాదుల పట్ల ప్రజాకారుల లా వ్యవహరించారన్నారు. ఈ ఘటన తమ దృష్టికి వచ్చిన తర్వాత దర్శి డిఎస్పి తో మాట్లాడి తాళ్లూరు పోలీస్ స్టేషన్లో ఎస్సీ, ఎస్టీ కేసు కట్టించామన్నారు. ఈ ఘటనపై దర్శి డిఎస్పి నేర స్థలాన్ని పరిశీలించారు సాక్షులను విచారించి స్టేట్మెంట్లు తీసుకున్నారు. అలాగే శివరాంపురంలో మాదిగ కులానికి చెందిన అనపర్తి షెడ్రక్ 26 సెంట్లు స్థలాన్ని ఆక్రమించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకుని అక్రమ కట్టడం వే బ్రిడ్జి మిల్క్ డైరీ కట్టిన స్థలాన్ని కూడా దర్శి డిఎస్పి పరిశీలించారు. పిట్లాపురం శివరాంపురం ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ల్యాండ్ గ్రాబింగ్ యాక్టివ్‌గా మార్చి అగ్రకుల నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపించాలని బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి కట్టిన అక్రమ కట్టడాలకు సహకరించిన పంచాయతీ సెక్రటరీ, సబ్ రిజిస్టర్ ఆఫీస్, విద్యుత్‌శాఖ వారిని కూడా ముద్దాయిలుగా చేర్చాలని దర్శి డిఎస్పి బాల మురళీకృష్ణను మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య డిమాండ్ చేశారు. తాళ్లూరు పోలీస్ స్టేషన్ వద్ద దర్శి డిఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన వారిలో యానాది పరిరక్షణ సమితి అధ్యక్షులు మేకల ఆదినారాయణ, ఓలా జీవరత్నం, మాల మహానాడు ప్రచార కార్యదర్శి ఎర్రమల శ్రీనివాసరావు తదితరులున్నారు.



# టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నేతలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 3)

మార్కాపురం మండలంలోని ఎల్‌బిఎస్ నగర్‌కు చెందిన వైసిపి నాయకులు మలపాటి శేఖర్‌రెడ్డి, మందటి రామ మోహన్‌రెడ్డి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో పార్టీ తీర్థంపుచ్చుకున్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని జవహర్ నగర్‌లో ఎమ్మెల్యే స్వగృహంలో పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వారికి పార్టీ కండవాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 3)

మండలంలోని నాగిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామస్తుల, తెలుగు యువత సహకారంతో 10 వేలు విలువగల నోటుబుక్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. విద్యార్థులకు మంచినీరు తాగేందుకు పాఠశాలకు 20వేల విలువగల వాటర్ ప్యూరిఫైయర్ పాఠశాలకు వితరణ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు మాట్లాడుతూ చదువుతోనే భవిష్యత్ మారుతుందన్నారు. తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మాణమవుతుందని చెప్పారు. పాఠశాల విద్యార్థుల దాహార్తిని తీర్చి స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి రూ. 20 వేలు విలువగల వాటర్ ప్యూరిఫైర్ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మల్ల వెంకట్రావు, కంటూ గోపికృష్ణ, కొరపాటి సురేంద్ర, ప్రధానోపాధ్యాయుడు మండవ కృష్ణారావు, ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పై ఉన్న చెత్త కుప్పలను వెంటనే తొలగించాలి

## కమీషనర్ టి వెంకట కృష్ణయ్య



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 3)

పారిశుద్ద పనుల పర్యవేక్షణ రోజువారి భాగంలో శుక్రవారం ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ టి వెంకట కృష్ణయ్య, నగరపాలక సంస్థ ఎంహెచ్‌వోతో కలిసి త్రోవగుంట, కేశవరాజు కుంట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో రోడ్డు పై ఉన్న చెత్త కుప్పలను వెంటనే తొలగించవలసినదిగా సంబధిత శానిటరీ ఇన్స్పెక్టర్ కి ఆదేశాలు జారి చేసారు. అలానే ఆయా ప్రాంతాల్లో ప్రజలతో సంభాషించి వారి ఇంటి వద్దకు ప్రతి రోజు శానిటరీ వర్కర్స్ వచ్చి చెత్తను తీసుకు వెళ్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. అలానే ప్రతి ఒక్కరూ కూడా చెత్తను తడి పొడి చెత్తలుగా వేరు చేసి వర్కర్స్ కి ఇవ్వవలసిందిగా సూచించారు. చెత్తను కాలవలో రోడ్ పై వేయకుండా తప్పనిసరిగా శానిటరీ వర్కర్స్ మాత్రమే ఇవ్వవలసిందిగా కోరారు. తరువాత ఒంగోలు బైపాస్ రోడ్ దగ్గర గల టీ షాప్ వారు రోడ్ పైనే తాగి పారేసిన టీ కప్‌లు ఉండటం గమనించి సంబంధిత టీ షాప్ యజమానికి రూ. 1,000లు ఫైన్ వేయాలని ఎంహెచ్‌వో ఆదేశాలు ఇచ్చారు. ఇలానే ఇంకొకసారి రోడ్ పైన చెత్త వేయకుండా వాటిని పోగు చేసి శానిటరీ వర్కర్స్ ఇవ్వవలసిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ టి వెంకట కృష్ణయ్యతో పాటు ఎంహెచ్‌వో వైష్ణవి, శానిటరీ సూపర్వైజర్ పిచ్చయ్య, 1వ డివిజెన్ శానిటరీ ఇన్స్పెక్టర్ మిరియం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



# యర్రగొండపాలెం నియోజకవర్గంలో కొనసాగుతున్న సర్ పై ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పర్యటన



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 3)

ఎర్రగొండపాలెం నియోజకవర్గం పెద్దారవీడు మండలం తోకపల్లి, సానికవరం గ్రామాలలో సంబందించిన బిఎల్‌ఏలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన సర్ గురించి వివరించి సర్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో బీఎల్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలపై చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. అనంతరం పార్టీ అందుబాటులోకి తీసుకువచ్చిన మై బూత్ మై ఓటర్ యాప్ ను తప్పనిసరిగా డౌన్లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని బీఎల్‌ఏలకు సూచించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల ఓట్లు తొలగించకుండా బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉంటూ ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందజేయడంలో అలసత్వం ప్రదర్శించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని బీఎల్‌ఏలకు తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బిఎల్‌ఓలను గుర్తిస్తే ఎమ్మెల్యే కార్యాలయంకు తెలియచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు

# లారీ డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణం

## మార్కాపురం డీఎస్పీ నాగరాజు

## పరారిలో ఉన్న లారీ డ్రైవర్‌ను పట్టుకుంటాం



(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 3)

మార్కాపురం జిల్లా కంభం పట్టణంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి లారీ డ్రైవర్ అతివేగమే ప్రధాన కారణమని మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. సీఐ మల్లికార్జున, ఎస్సై శివ కృష్ణారెడ్డి తో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అధిక వేగంతో వాహనాన్ని నడపడం వల్లే ఈ విషాద ఘటన చోటుచేసుకుందని వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని, క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అతని నిర్లక్ష్యమే ప్రమాదానికి దారితీసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని డీఎస్పీ నాగరాజు వెల్లడించారు. అదే విధంగా వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు తలెత్తుతున్నాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీఎస్పీ నాగరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మాజీ సర్పంచ్ ఇలకోటి శివారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూలై 3)

యర్రగొండపాలెం మండలంలోని తమడపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ ఇలకోటి శివారెడ్డిని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ఆయన ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని, ప్రస్తుతం తమడపల్లిలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శివారెడ్డి నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. శివారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను అడిగారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, పార్టీ మరియు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.